‘బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు’

ఐఎన్‌టీయూసీ కార్మిక నేత చింతల నాగరాజు



కుత్బుల్లాపూర్: బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని... మల్కాజిగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డి తప్పకుండా విజయం సాధిస్తారని ఐఎన్‌టీయూసీ కార్మిక నేత చింతల నాగరాజు అన్నారు. చింతల్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ... వచ్చే ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని కార్మికులతో కలిసి తీర్మానం చేశామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం మూలంగా కాంగ్రెస్ ఎంపీలుగా గెలిచిన అభ్యర్థులు తమ పార్లమెంట్ పరిధిలో అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేసుకునే వీలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. తప్పకుండా రాబోయే 18 రోజుల్లో కార్మికులు వాడవాడల్లో తిరుగుతూ ప్రచారం చేయాలన్నారు.

- జీడిమెట్ల, గాంధీనగర్, బొల్లారం, జిన్నారం, బాలానగర్ పారిశ్రామికవాడల్లో ఇప్పటికే కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ విజయం కోసం పాటుపడుతున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ప్రజలకు మభ్యపెట్టే విధంగా హామీలు ఇచ్చి ఓట్లు అడిగే అవకాశం ఉందన్నారు. కార్మికులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తప్పకుండా తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఒక్క సీటు గెలవరన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ప్రచారం

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా గురువారం కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 7గంటలకు ప్రారంభమయ్యే ప్రచారంలో మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంస్థల నాయకులు పాల్గొనాలని కొంపల్లి మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు కోరారు.

రెడ్డి ఎవెన్యూ సమస్యలను పరిష్కరించాలి



మేయర్ నీలారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

నిజాంపేట్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని రెడ్డి ఎవెన్యూ సంక్షేమ సంఘం సభ్యులు స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మేయర్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో పర్యటించి వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. అదే విధంగా పలు శుభకార్యాలకు రావాలని పలువురు మేయర్‌కు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ఉత్తమ ఫలితాలు.. సంతోషంలో తల్లిదండ్రులు

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు



బి.రాఘవి(911/1000) సీనియర్ ఎంపీసీ



విజయ దరహాసంతో గాయత్రి విద్యా సంస్థల యాజమాన్యం, విద్యార్థులు



రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధించిన భాగ్యరథి విద్యార్థులు అఫ్సాన్ జబీన్, రవీనా, షాహిమా, నందినిలతో కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి



నజ్‌నీన్ బేగం(442/470) జూనియర్ ఎంపీసీ

కుత్బుల్లాపూర్: ఇంటర్ ఫలితాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. దీంతో ఆయా కళాశాలల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. తమ విద్యార్థులు మంచి మార్కులు సాధించడంతో కళాశాలల యాజమాన్యాలు కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.



పుష్పలత (427/470) జూనియర్ ఎంపీసీ



పూజిత (801/1000), సీనియర్ ఎంపీసీ



వర్ష (911/1000), సీనియర్ బైపీసీ



షబ్నమ్ (979/1000) సీనియర్ ఎంపీసీ



ఎస్‌కే రషీద్ (972/1000) సీనియర్ బైపీసీ

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు..

- బహదూర్‌పల్లి క్రాస్ రోడ్డులోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించారు.
- సీనియర్ ఎంపీసీలో భోగ రాఘవి (918/1000), పూజిత (801/1000), సీనియర్ బైపీసీలో డి.వర్ష (911/1000), సీఈసీలో ఎండీ అస్మా (785/1000), హెచ్‌ఈసీలో విష్ణువర్ధన్ (610/1000) మార్కులు సాధించారు.
- జూనియర్ ఎంపీసీ గ్రూప్‌లో మంగలి పుష్పలత (452/470,), నజ్‌నీన్ బేగం (442/470), సాయికుమార్ (427/470), బైపీసీ గ్రూపులో సనబేగం (382/440), అమీనా ఫాతిమా (382/440), రబియా (367/440), సీఈసీ గ్రూప్‌లో షమ్మ ఖతున్ (391/500) హెచ్‌ఈసి గ్రూపులో సయిదా బేగం (361/500) సాధించారు.

ప్రతిభ కనబరిచిన గాయత్రి విద్యార్థులు..

- చింతల్‌లోని గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. సీనియర్ బైపీసీలో తేజశ్విని (992/1000), ఎంపీసీలో హన్సిక (991/1000), ఎంఈసీలో శివాని (982/1000), సీఈసీలో కరోలిస్ (979/1000) మార్కులు సాధించారు.
- జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ప్రజ్వలితరెడ్డి, మోనాల్, రుత్విక్ లు (468/470) మార్కులు, జూనియర్ బైపీసీలో వైశాలి, వినయ్‌కుమార్‌లు (438/440) మార్కులు, జూనియర్ ఎంఈసీలో శ్రావ్య(495/500), జూనియర్ సీఈసీలో స్పందన (493/500) మార్కులు సాధించారు. కళాశాల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, అకడమిక్ హెడ్ శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జి సీహెచ్ నరేష్‌లు విద్యార్థులను అభినందించారు.

స్టేట్ ర్యాంక్ సాధించిన భాగ్యరథి విద్యార్థులు..

- ఇంటర్ ఫలితాలలో చింతల్ భాగ్యరధి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో అఫ్సాన్ జబీన్(438/440) మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించింది. జూనియర్ సీఈసీ గ్రూప్‌లో షాహిమా (492/500), జూనియర్ ఎంపీసీలో రవీనా (466/470), ఎంఈసీలో నందిని (485/500) మార్కులు సాధించారు.
- సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో షబ్నమ్ (979/1000), సీనియర్ బైపీసీలో ఎస్‌కే రషీద్ (972/1000), సీనియర్ ఎంఈసీ గ్రూపులో సౌమ్య (914/1000), సీనియర్ సీఈసీలో సాయిచందన (976/1000) మార్కులు సాధించారు.
- అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు కె.రామకృష్ణ, జి.రమేష్‌బాబు, నల్ల జైశంకర్‌గౌడ్, చల్లా గోవిందరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతోనే రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధ్యపడ్డాయని అన్నారు. గత 14 సంవత్సరాలుగా స్టేట్ ర్యాంక్‌లు సాధిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు.

సత్తాచాటిన విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు



రిష్మితచౌదరి (987/1000)



పూర్ణశ్రీ (987/1000)

నిజాంపేట్: ఇంటర్ ఫలితాల్లో విజ్ఞాన్ కళాశాల నిజాంపేట్, మేడ్చల్ బ్రాంచ్‌ల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో రిష్మితాచౌదరి (987/1000), పూర్ణశ్రీ (987/1000), కీర్తిరెడ్డి (987/1000), నిషితరెడ్డి (987/1000), పూజిత (987/1000) మార్కులు, బైపీసీ గ్రూపులో శివనందిని (981/1000) మార్కులు సాధించారు. అదే విధంగా జూనియర్ ఇంటర్ ఎంపీసీలో అఖిల(467/470)), బైపీసీలో ప్రణవి (435/440) మార్కులు సాధించగా విద్యాసంస్థల వైస్‌చైర్‌పర్సన్ రాణిరుద్రమదేవి, ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్, ప్రసాద్‌లు అభినందించారు.



నిషితరెడ్డి (987/1000)



కీర్తిరెడ్డి (987/1000)

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన ఎస్ఆర్ శ్రీగాయత్రి

దుండిగల్: ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ శ్రీగాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో కె.ప్రజ్వలితరెడ్డి, డి.మోనాల్, రుత్విక్‌లు 468 మార్కులు, బైపీసీలో వైశాలి, వినయ్‌కుమార్‌లు 438 మార్కులు, ఎంఈసీలో శ్రావ్య 495, సీఈసీలో స్పందన 493, సీనియర్ ఇంటర్‌లో బైపీసీలో తేజస్విని(992), ఎంపీసీలో హన్సిక(991), ఎంఈసీలో శివాని(982), సీఈసీలో కరోలిన్(979) మార్కులు సాధించారు. వీరిని విద్యాసంస్థల డైరెక్టర్ ఏ.సంతోష్‌రెడ్డి, డీజీఎం బి.భగవాన్‌రెడ్డి, అకడమిక్ డీన్ కె.శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జులు, ప్రిన్సిపాళ్లు ప్రత్యేకంగా అభినందించారు.

ఫలితాల్లో శివశివానీ విద్యార్థులు అదుర్స్

కుత్బుల్లాపూర్: ఇంటర్ ఫలితాల్లో కొంపల్లికి చెందిన శివశివానీ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. సీనియర్ ఎంపీసీలో వి.ప్రణీత (987/1000), పూజా మిశ్రా(986/1000), జూనియర్ ఇంటర్‌లో నజ్మీ తరానుమ్(467/470), ధనరాజ్ వైష్ణవ్ (467/470), ఈ. ఇందు (466/470), జూనియర్ ఎంఈసీలో ఖానిష్ చౌదరి (489/500), ఎం.దినేష్ (489/500), జూనియర్ సీఈసీలో ఆకృతి సింగ్ (492/500), వైష్ణవి కుమారి (492స/500) మార్కులు సాధించగా కళాశాల యాజమాన్యం అభినందించింది.

స్టేట్ ర్యాంకర్ హంసికకు నగదు పురస్కారం



విరామినేని హంసికకు నగదు పురస్కారం అందజేస్తున్న ఎస్ఆర్ నాయక్‌నగర్ అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస్

జీడిమెట్ల: ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌నాయక్‌నగర్‌కు చెందిన రామినేని హంసిక స్టేట్ మొదట ర్యాంక్ సాధించింది. కూకట్‌పల్లి నారాయణ గర్ల్స్ కళాశాలలో ఎంపీసీ విభాగంలో చదువుతున్న హంసిక (993/1000) మార్కులు సాధించింది. అత్యుత్తమ మార్కులతో కాలనీ పేరు నిలబెట్టిన హంసికకు కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస్ రూ.20వేల నగదు బహుమతిని అందజేశారు.

‘మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ బలంగా ఉంది’



రాగిడి నామినేషన్ ర్యాలీలో మాజీ మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డిలతో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుల నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు వివేకానంద్, శంభీపూర్ రాజులు మాట్లాడుతూ... మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో బీఆర్‌ఎస్ బలంగా ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడూ స్థానాలను కైవసం చేసుకున్నామని పేర్కొన్నారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. మోసపూరితమైన వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్

మంద కృష్ణ మాదిగ

పంజగుట్ట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రెడ్డి కుల తత్వం పెరిగి పాకాన పడిందని దాన్ని వెంటనే తొలగించకపోతే రాష్ట్రంలో భవిష్యత్‌లో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి వల్ల కాంగ్రెస్ గెలవలేదని అందుకు ఉదాహరణ మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ ఆయన పార్లమెంట్ పరిధిలో ఏడు ఎమ్మెల్యే సీట్లల్లో ఒక్కటి కూడా గెలవలేదని, కేవలం కేసీఆర్ అహంకార పాలనకు వ్యతిరేకంగా ఓటువేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకులంలో రెడ్డిలను మినహాయించి ఏ కులానికి కూడా ఐదు కీలక పదవులు ఇవ్వలేదన్నారు. అన్ని కీలక పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో రెడ్డిలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించడంలో రెడ్డి కులస్తులకన్నా ముస్లింలే ప్రముఖపాత్ర పోషించారని అన్నారు.

ఆకట్టుకున్న ఆభరణాలు

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని తనిష్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లామ్ గోల్డ్ కలెక్షన్ ప్రదర్శనలో టాప్ మోడల్స్ బంగారు ఆభరణాలతో అలరించారు. నిత్య జీవనంలో భాగంగా ఆభరణాలతో ఎలా అలంకరించుకుంటారనే అంశాలను ప్రదర్శిస్తూ అందాల ముద్దుగుమ్మలు ఆకట్టుకున్నారు. ఈ స్టైలిస్ట్ ఈవెంట్‌లో మోడల్స్‌తో పాటు పలువురు ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొన్నారు.

సిబ్బంది విధులెక్కడో..

ఓటు అక్కడే..

- లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనేవారు ఓటు వినియోగించుకునేలా ఏర్పాట్లు
- ఇతర నియోజకవర్గంలో విధులు నిర్వర్తిస్తే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగం
- మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో 313 సెక్టోరియల్ అధికారులు, 19,450 ఎన్నికల సిబ్బంది

సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది తప్పని సరిగా ఓటును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఓటు కలిగి ఉండి.. అదే నియోజకవర్గం పరిధిలో మరోచోట విధులు నిర్వర్తిస్తున్న వారికి ఈడీసీ (ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్) ద్వారా అక్కడే ఓటు వినియోగించుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆ అవసరం లేకుండా విధులు నిర్వర్తించే చోట ఓటువేయవచ్చు.

ఈడీసీతో వినియోగం

ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ) ద్వారా ఓటు వినియోగించుకునే వారందరూ ఫారం–12ఏ నింపి ఇవ్వాల్సి ఉంటుంది. పోలింగ్ తేదీకి ముందే ఈ దరఖాస్తును సహాయ రిటర్నింగ్ అధికారి(ఏఆర్వో)కి సమర్పించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికల విధుల వివరాలు, ఓటు ఉన్న శాసనసభ నియోజకవర్గం, గ్రామం, పట్టణం ఓటరు జాబితాలో వరుస సంఖ్య వంటి విషయాలు స్పష్టం చేయాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓటు వినియోగించుకొనేందుకు అనుమతిస్తారు.

పరిధి మారితే పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు లేదా కిందిస్థాయి సిబ్బంది ఎవరైనా వారు లోక్‌సభ నియోజకవర్గం పరిధి దాటి మరో నియోజకవర్గం పరిధిలో విధులు నిర్వర్తించాల్సి వస్తే తప్పని సరిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటోంది. సిబ్బంది ముందస్తుగా దరఖాస్తు చేసుకుంటేనే అవకాశం ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్‌ను కూడా ఈడీసీ పద్ధతి మాదిరిగా ముందస్తుగా దరఖాస్తు స్వీకరించి ఓటు హక్కు కల్పిస్తారు. వీటిని ఆయా మండల కేంద్రాలు, శిక్షణ సమయంలో స్వీకరించి పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పిస్తారు.

ఎన్నికల సిబ్బంది 19,450 మంది

దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, ఎల్బీనగర్ ఉన్నాయి. ఈ లోక్‌సభ నియోజకవర్గంలో 313 మంది సెక్టోరల్ అధికారులు ఉండగా, 19,450 మంది ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

ఖాళీ స్థలంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు

కుత్బుల్లాపూర్: ఖాళీ స్థలంలో మంటలు వ్యాపించడంతో దట్టమైన పొగలు ఎగసిపడ్డాయి. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గోదాం తగలబడి పోతుందని కొంతమంది.. లేదు ఖాళీ స్థలంలో మంటలు వ్యాపిస్తున్నాయని మరికొంత మంది.. ఇలా చివరకు ఎటువంటివి నష్టం వాటిల్లకుండా ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పించారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవరయాంజల్‌లో ఉన్న ఇండ్‌వేర్ గోదాం పక్కన ఖాళీ స్థలంలో బుధవారం మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తాచెదారంతో పాటు చెట్లు ఎండిపోగా అవి కూడా పూర్తిగా ఖాళీ బూడిదయ్యాయి. పేటబషీరాబాద్ పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.

ఈనెల 29 నుంచి గీతా సమ్మర్ క్యాంపు

ఆల్విన్‌కాలనీ: అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గీతా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మహా శృంగదాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 29వ తేదీ నంచి మే 10వ తేదీ వరకు గీతా సమ్మర్ క్యాంప్ కొనసాగుతుందని పేర్కొన్నారు. భగవద్గీత పారాయణం ఉపోద్ఘాతం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సింగింగ్, స్కేటింగ్, స్విమ్మింగ్, గేమ్స్, డ్రామా, దేశభక్తి కథలు, శ్లోకాల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు. ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం టిఫిన్, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

తప్పించుకు తిరుగుతున్న భూ కబ్జాదారుడి రిమాండ్





నిందితుడు షేక్ అబీద్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న జగద్గిరిగుట్ట పోలీసులు

జగద్గిరిగుట్ట: కొద్ది రోజులుగా తప్పించుకు తిరుగుతున్న భూ కబ్జాదారుడు షేక్ అబీద్‌ను ఎట్టకేటకు జగద్గిరిగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... షేక్ అబీద్ కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ భూమిని అమ్మి పేదలను మోసం చేసిన ఘటనలో పలు ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు కాగా కోర్టులకు కూడా హాజరుకాలేదు. ఈ మేరకు కొంత కాలంగా గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం పక్కా సమాచారంతో అబీద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడిపై 16 కేసులు ఉన్నట్లు ఆయన తెలిపారు. అబీద్‌పై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

నాలా పూడికతీతపై జెడ్‌సీ సమీక్ష

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో నాలా పూడికతీత పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నాలాల పూడికతీత పనులు జరిపినా మొదటగా కాలనీ సంక్షేమ సంఘాలకు ఫిర్యాదుల రిజిస్టర్ గురించి తెలియజేయాలని సూచించారు. నాలాల పూడికతీత పనుల్లో అవకతవకలు జరగకుండా చూసేందుకే ఇలా చేస్తున్నామన్నారు. పారదర్శకంగా పనులు జరగడానికి జీహెచ్‌ఎంసీ వారు ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో స్థానికుల అభిప్రాయాలను నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ చిన్నారెడ్డి, అన్ని సర్కిళ్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.